సాక్షి
ఖమ్మం

గురువారం । 14 । నవంబర్ । 2024

న్యూస్‌రీల్

వైరా రిజర్వాయర్‌లో రొయ్యపిల్లలు విడుదల



రొయ్యపిల్లలను విడుదల చేస్తున్న దృశ్యం

వైరా: వైరా మత్స్య సొసైటీ ఆధ్వర్యాన స్థానిక రిజర్వాయర్‌లో బుధవారం రూ.20లక్షలు విలువైన రొయ్యపిల్లలను విడుదల చేశారు. గతంలో ప్రభుత్వం రొయ్యపిల్లలను ఇవ్వగా, ఈసారి అలా జరగకపోవడంతో సొసైటీ ఆధ్వర్యాన కొనుగోలు చేసి వదిలినట్లు మత్స్య సొసైటీ చైర్మన్ షేక్ రహీం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఖమ్మం మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: కార్తీక పౌర్ణమి, వారాంతం కారణంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 15వ తేదీ శుక్రవారం కార్తీక పౌర్ణమి, 16న శనివారం వారాంతపు సెలవు, 17న ఆదివారం సాధారణ సెలవు కారణంగా కొనుగోళ్లు జరగవని వెల్లడించారు. ఈనెల 18న సోమవారం నుంచి యధావిధిగా మార్కెట్ నిర్వహణ ఉంటుందని ఆయన తెలిపారు.

సిరిసిల్ల జిల్లా మత్స్యకారులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త గణేష్

కూసుమంచి: మండలంలోని పాలేరు శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మత్స్య సహకార సంఘాల సభ్యులకు మూడు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ బుధవారం ప్రారంభమైంది. పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకారులు ఆధునిక, సాంకేతిక విధానాలు అవలంబిస్తే చేపల పెంపకం లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. అనంతరం చేపల మేత తయారీ, ముడిపదార్థాల సేకరణపై అవగాహన కల్పించగా మామునూరు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ జి.గణేష్ పంజర వలల్లో చేపల పెంపకాన్ని వివరించారు. పాలేరు కేంద్రం శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు మద్దతు ధర చెల్లించాలి



పత్తిలో తేమ శాతాన్ని పరీక్షిస్తున్న సీపీ సునీల్‌దత్

తల్లాడ: పత్తి తీసుకొచ్చే రైతులకు నాణ్యత ఆధారంగా మద్దతు ధర దక్కేలా వ్యాపారులు కొనుగోళ్లు చేపట్టాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. తల్లాడలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. తేమ శాతం నిర్ధారణ, ధర వివరాలు తెలుసుకున్న ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా మద్దతు ధర చెల్లిస్తూ పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు. తేమ శాతం పేరుతో ఇబ్బంది పెడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. తల్లాడ ఎస్‌ఐ బి.కొండల్‌రావు, సిబ్బంది, మిల్లు నిర్వాహకులు సింగిరికొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 20.23శాతం సర్వే

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం మయూరిసెంటర్/నేలకొండపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో కొనసాగుతోంది. బుధవారం నాటికి 20.23శాతం మేర సర్వే పూర్తయిందని అధికారులు వెల్లడించారు. జిల్లాలో 5,65,998 ఇళ్లకు గాను 1,14,493ఇళ్లలో సర్వే పూర్తిచేసినట్లు తెలిపారు. కాగా, ఇంటింటి కుటుంబ సర్వేను సీఎంఓ ప్రత్యేక అధికారి రవికాంత్ ఖమ్మంలో బుధవారం పరిశీలించారు. పలు డివిజన్లలో పర్యటించిన ఆయన సర్వేపై ప్రజల నుండి వస్తున్న స్పందన తెలుసుకున్నారు. అనంతరం ఎన్‌ఎస్‌పీ అతిథిగృహంలో మీడియాతో సమావేశమైన రవికాంత్ మాట్లాడుతూ సర్వేపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ మేనేజర్ విజయానంద్ పాల్గొన్నారు. తొలుత రవికాంత్ నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరంతో పాటు శ్రీ ఉత్తరేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాలను సందర్శించడమే కాక బౌద్ధక్షేత్రాన్ని పరిశీలించారు.



తలసేమియా చిన్నారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

'తలసేమియా చిన్నారులది సాధారణ జీవితం కాదు.. ఒడిదుడుకులను అధిగమిస్తూ ఉన్నత స్థాయికి చేరి కలలను నిజం చేసుకునేందుకు మేం అండగా నిలుస్తాం.' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. 'సాక్షి' మీడియా గ్రూప్, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన తలసేమియా చిన్నారుల సమక్షాన బుధవారం చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చిన్నారులతో సరదాగా గడిపారు. సాధారణ వ్యక్తిలా కింద కూర్చుని మాట్లాడి సమస్యలు, చికిత్స వివరాలు తెలుసుకోవడమే కాక భవిష్యత్‌పై దిశానిర్దేశం చేశారు. – ఖమ్మంమయూరిసెంటర్

మీ సంకల్పానికి అండగా ఉంటాం

ఆనందంగా గడిపాం..



కలెక్టర్ మా వద్దకు వస్తున్నారంటే తొలుత ఆశ్చర్యమేసింది. కలెక్టర్ సార్ వచ్చి మాతో పాటే నేలపై కూర్చుని మమ్మల్ని పలకరించిన విధానం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. సార్ ఉన్నంతసేపు ఆనందంగా గడిపాం. మమ్మల్ని ఉత్సాహపర్చడమే కాక మాలో ధైర్యాన్ని నింపారు.

– బి.సునీల్, చిన్నారి

మాకు గుర్తుండిపోయే రోజు..



బాలల దినోత్సవానికి విహార యాత్రలకు వెళ్లడం, మిత్రులతో సరదాగా గడిపేవాళ్లం. తొలిసారి 'సాక్షి' మీడియా గ్రూప్, మా సంస్థ నిర్వహించిన కార్యక్రమం అద్భుతంగా సాగింది. కలెక్టర్ సార్‌తో గంట సమయం గడిపిన ఈ రోజు మాకు జీవితంలో గుర్తుండిపోతుంది.

– ఎస్.శ్రీలక్ష్మి, విద్యార్థిని

బాధలన్నీ మర్చిపోయాం..



సొంత మనిషిలా మాతోపాటు నేలపై కూర్చుని కలెక్టర్ సార్ మాట్లాడడం ఆనందాన్ని ఇచ్చింది. ఫ్రీగా ఉండండి.. మీ సమస్యలు చెప్పండి.. నేనున్నా అంటూ సార్ మాట్లాడడం మా బాధ మరిచిపోయేలా చేసింది. సార్‌తో గడిపినంత సేపు మేమూ ఎదగాలనే ఆలోచన వచ్చింది.

– ఇ.మాన్విత, విద్యార్థిని

- తలసేమియా చిన్నారులు ఎదిగేలా నిరంతర సహకారం
- స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయం
- ఇక్కడి డాక్టర్ల పనితీరుతో వైద్యరంగానికి గుర్తింపు
- మీడియా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం భేష్

'సాక్షి' మీడియా, సంకల్ప సంస్థ ఆధ్వర్యాన చిల్డ్రన్స్ డే వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్. పక్కన సాక్షి బ్యూరో ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, డాక్టర్ నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పావని, అనిత తదితరులు

సమాజం తరఫున అభినందనలు

సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తలసేమియా చిన్నారులకు చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. చాలా మంది కష్టాలు అనుభవించినా.. పెద్ద ఆలోచన చేసే వారు తక్కువగా ఉంటారని తెలిపారు. మరొకరికి కష్టం కలగకుండా అవగాహన కల్పించడం సాధారణ విషయం కాదన్నారు. మంచి లక్ష్యంతో సంస్థను నిర్వహిస్తున్న బాధ్యులను సమాజం తరఫున అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇక వైద్యులు తలసేమియా చిన్నారులకు సేవలు అందించడం హర్షణీయమని.. ఇలాంటి వైద్యుల పనితీరుతోనే చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ధైర్యం కలుగుతుందని చెప్పారు.

మీడియా నాలుగో స్తంభం..

'సాక్షి' మీడియా గ్రూప్ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడాన్ని కలెక్టర్ ప్రశంసించారు. మీడియాలో మంచి విలువలు కలిగిన జర్నలిస్టులు ఉన్నారని కొనియాడారు. ఎన్నికలు, కోవిడ్ వంటి క్లిష్ట సమయాల్లో సమాజానికి సమాచారం చేరవేయడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా లేకపోతే సమాజం స్థిరంగా ఉండదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ఈ నమ్మకం మరింత బలపడుతుందని తెలిపారు.



చిన్నారితో ఆడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్

అద్భుత ఫలితాలు సాధించాలి..

తలసేమియా చిన్నారులతో మాట్లాడిన కలెక్టర్ వారికి ధైర్యంచెప్పారు. కష్టాలు వచ్చాయని ఆలోచించకుండా అవి తొలగిపోతాయనే నమ్మకంతో ముందుకు సాగాలన్నారు. అద్భుతమైన డాక్టర్లు చికిత్స చేస్తున్నందున శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. చిన్నారుల వెంట తల్లిదండ్రులే కాక సమాజం ఉన్నందున ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని తెలిపారు. అమెరికాలో కంపెనీ స్థాపించాలనే స్థాయిలో ఆలోచించాలని చెప్పారు. తప్పక అద్భుతమైన భవిష్యత్ ఉంటుందని భరోసా కల్పించారు.

కేక్ కట్ చేసి.. ఆటలాడి..

చిల్డ్రన్స్ డే సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన కలెక్టర్ వారితో ఆటలాడి ఉత్సాహపరిచారు. కలెక్టర్ తమతో గంటకు పైగా గడపగా చిన్నారులు సంతోషించారు. ఈకార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, డెస్క్ ఇన్‌చార్జి ప్రతాపురం శ్రీనివాస్, సాక్షి టీవీ ఇన్‌చార్జి పసునూరి మహేందర్, ఏడీవీటీ ఇన్‌చార్జి నామ నాగేశు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజు, ఆర్సీ ఇన్‌చార్జి నెల్లూరి ఉపేందర్‌తో పాటు మాదినేని శ్రీనివాస్, జుజ్జూరి ఉపేందర్, గోపతి నాగేందర్, అన్నంచిన్ని వెంకట రామారావు, ఎం.డీ.హుస్సేన్, గడ్డం సతీష్, కారుమంచి శ్రీను, జి.నరసింహారెడ్డి, శేషయ్య, పాషా, నందకుమార్, సంకల్ప సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి ఉదయ్‌భాస్కర్, రవిచందర్, వంశీకిరీటి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో మనో ధైర్యం..



కలెక్టర్ ఉన్నంతసేపు చిన్నారులు ఉత్సాహంగా, ఆనందంగా గడిపారు. సార్ మాట్లాడుతున్నంతసేపు వారిలో కొత్త అనుభూతిని చూశా. ఇలాంటి కార్యక్రమాలతో మనోధైర్యం పెరుగుతుంది. ఇందుకు చొరవ చూపిన 'సాక్షి' మీడియా గ్రూప్ వారికి ధన్యవాదాలు.

– పి.అనిత, వ్యవస్థాపకురాలు, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ

సార్‌కు సమస్యలు చెప్పుకున్నాం..



బాలల దినోత్సవంలో మా చిన్నారులతో కలిసి కలెక్టర్ పాల్గొనడం సంతోషాన్ని కలిగించింది. తలసేమియా చిన్నారులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలను సార్‌కు విన్నవించుకునే అవకాశం దక్కింది. దీంతో చిన్నారులు, తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు.

– పి.పావని, సంస్థ ఉపాధ్యక్షురాలు

కలెక్టర్ రావడం చాలా సంతోషం



వేడుకలకు కలెక్టర్ రావడం సంతోషంగా ఉంది. తలసేమియా చిన్నారులకు జీఓ 5 అమలు చేసే విషయాన్ని సార్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. మా ఆస్పత్రిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు.

– డాక్టర్ నారాయణమూర్తి, రితన్య హాస్పటల్

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుపై శ్రద్ధ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుపై అధికారులు శ్రద్ధ వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆమె వీసీ ద్వారా ధాన్యం, పత్తి కొనుగోళ్లు, ఇంటింటి సర్వే, గ్రూప్ -3 పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్షల్లో లోపాలు ఎదురుకాకుండా నిర్వహించాలన్నారు. అలాగే, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు కాంటా వేయించి మిల్లులకు తరలించాలని సూచించారు. సమగ్ర ఇంటింటి సర్వేపై ప్రత్యేక దృష్టి సారించి ఈనెల 16 నుంచి డేటా ఎంట్రీ ప్రారంభించాలని తెలిపారు. ఆతర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి గ్రూప్-3 పరీక్షల నిర్వహణపూ సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పలు వివరాలు వెల్లడించారు. ఆతర్వాత అయన వివిధ శాఖల అధికారులతో హాజరైన సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్,



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన సీపీ, అదనపు కలెక్టర్లు

అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్, జిల్లా మేనేజర్ జి.శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం తదితరులు పాల్గొన్నారు. తొలుత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి నిర్వహించిన వీసీకి జిల్లా నుంచి హాజరైన అదనపు కలెక్టర్ శ్రీజ పరీక్షలకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈ వీసీలో డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.

ఈసారైనా ముడిపడేనా..?!

- ముచ్చటగా మూడోసారి బేతుపల్లిలో భూసర్వే
- రికార్డుల్లో 280 ఎకరాలకుపైగా అదనంగా భూమి



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 133లో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం ఉపక్రమించింది. ఎనిమిది మంది సర్వేయర్లతో ఈ సర్వే నంబర్‌లోని 3,090 ఎకరాల భూమిని సర్వే చేసి హద్దులు నిర్ధారించేందుకు రంగంలోకి దిగింది. 2016, 2021లో అప్పటి కలెక్టర్ల ఆదేశాల మేరకు సర్వే చేసినా కొందరికి పాస్‌పుస్తకాలు రాకపోవడంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో మూడోసారి చేపడుతున్న సర్వేలోనైనా సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

11,700 ఎకరాల భూమి

సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి రెవెన్యూనే పెద్దది. ఈ పరిధిలో ఏడు పంచాయతీలు, గ్రామాలతో 11,700 ఎకరాల భూమి ఉంది. ఇందులో సర్వే నంబర్ 133లో 3,090 ఎకరాల భూమి ఉండగా.. భూమి లేని పలువురు రిజిస్ట్రేషన్ చేయించుకుని, పహాణీల్లో ఎక్కించుకోవడంతో 280ఎకరాలకు పైగా అదనంగా నమోదు కాగా సమస్య తలెత్తింది.

అన్ని రికార్డులు ఉన్నాయి...

సత్యనారాయణపురం వెనుకకుంట వద్ద సుమారు 30మంది రైతులకు చెందిన 50 ఎకరాలకుపైగా భూసర్వేపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. 50ఏళ్లుగా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న తమను ఆంధ్రా ప్రజలుగా పేర్కొంటూ సర్వేను అడ్డుకుంటున్నారంటూ వాపోయారు. తమ వద్ద భూముల రికార్డులు ఉన్నా ఒకరిద్దరు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రికార్డుల ప్రకారం సర్వే చేసి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరారు.

చివరి దశకు చేరింది...

సర్వే నంబర్ 133లో సర్వే మరో రెండు రోజుల్లో పూర్తవుతుందని కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్ తెలిపారు. సత్యనారాయణపురంలో సర్వే బృందంతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. భూమిలో లేకుండా రికార్డుల్లో ఉన్న వారి పేర్లను గుర్తిస్తున్నామన్నారు. ఆపై ఎక్కువగా వచ్చిన భూమిని తొలగించి మోఖాలో ఉన్న వారి పేర్లు రికార్డుల్లో నమోదు చేస్తామని చెప్పారు. మిగిలిన సర్వే నంబర్లలోనూ సర్వే చేసి హద్దులు నిర్ధారిస్తామన్నారు. ఇక ఏ ప్రాంతం వారైనా భూమి ఉంటే రికార్డుల్లో నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

అకాల వర్షంతో రైతుల్లో కలవరం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో బుధవారం రాత్రి పలుచోట్ల వర్షం కురిసింది. రాత్రి 7–30 గంటల తర్వాత ఆకాశం మేఘావృతమై వర్షం మొదలైంది. పలు ప్రాంతాల్లో రాత్రి 9 గంటల వరకు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. ముదిగొండలో 11.8, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 9.5, ఖానాపురంలో 8, కల్లూరులో 7.8, రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో 3.3, తల్లాడ మండలం కుర్నవల్లిలో 2.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. అయితే, వరి కోతలు జోరుగా సాగుతుండడంతో రైతులు ధాన్యాన్ని ఆరబోశారు. మరోపక్క పత్తితీతలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యాన వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లు కప్పి రేయింబవళ్లు కాపలా ఉంటున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పంటలు విక్రయించండి



సత్తుపల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ, తదితరులు

సత్తుపల్లి/కల్లూరు రూరల్: రైతులు పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం ద్వారా మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. సత్తుపల్లిలోని అయ్యగారిపేట, కల్లూరు మండలంలోని కొర్లగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నాణ్యత ఆధారంగా ధాన్యం కాంటాలు చేపడుతూ ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో సీఐ టీ.కిరణ్, ఏడీఏ శ్రీనివాస రెడ్డి, ఏఓలు వై.శ్రీనివాసరావు, ఎం.రూప, ఏఈఓలు టి.నరేష్, శిరీష, సొసైటీ సీఈఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జీరో నుంచి హీరో !

- ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా 'ఆ'గని' పయనం
- కూలీ నుంచి సింగరేణి సీఎండీగా ఎదిగిన బలరాంనాయక్



ఐఆర్‌ఎస్ శిక్షణలో...

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సంకల్పం గట్టిదైతే పంచ భూతాలు కూడా తోడుగా నిలుస్తాయనడానికి సింగరేణి సీఎండీ బలరాంనాయక్ జీవితం ఓ ఉదాహరణ. ఆర్థిక ఇబ్బందులు అడ్డుగా నిలిచినా, కుటుంబ బాధ్యతలు మీద పడినా కలలు కనడం ఆపలేదు. వాటిని సాకారం చేసుకునేందుకు కండలు కరిగించారు, మెదడును మథించారు. అందువల్లే ఆయన ప్రస్థానం జీరో నుంచి రియల్ హీరో స్థాయికి చేరింది. స్ఫూర్తిగా నిలిచే ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలు రేపటిపౌరుల కోసం..

అధికారిని చూసి ఆశ్చర్యపోయి..

మహబూబ్‌నగర్ జిల్లా తిరుమలగిరి మండలం బాలానగర్ తండాకు చెందిన నూనావత్ హున్యా, కేస్లీ దంపతులకు ఏడుగురు సంతానం కాగా, బలరాంనాయక్ పెద్దవాడు. ఆ కుటుంబానికి నాలుగెకరాల పొలం ఉన్నా నీటి వసతి లేక తిండి గింజలకు సరిపడా పంట కూడా వచ్చేది కాదు. దీంతో పిల్లలను గ్రామంలోనే వదిలేసి కూలీ పనుల కోసం తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడి ఉన్నా అక్షరాల వెంట పరుగులు తీయడంలో బాల్యం నుంచి బలరాం ముందుండే వాడు. ఎప్పుడైనా ఎమ్మార్వో (ప్రస్తుత తహసీల్దార్) వంటి అధికారులు తండాకు వస్తే వారికి దక్కే గౌరవం చూసి ఆశ్చర్యపోయేవాడు. తాను అలా కావాలనే కోరిక కలిగేది. కానీ కుటుంబ పరిస్థితులు అలా లేవు. దీంతో సెలవులు వస్తే భవన నిర్మాణ పనులకు వెళ్లి కూలీగా వచ్చిన రూ.25 దాచుకుని పుస్తకాలు కొనుక్కునేవాడు.

కలలకు రెక్కలు

బాగా చదివితే పెద్ద ఆఫీసర్ కావొచ్చని స్కూల్ టీచర్లు చెప్పిన మాటలు చెవుల్లో మోగుతున్నా కుటుంబ పరిస్థితుల కారణంగా ఇంటర్ కాగానే చదువు ఆపేసి శారదను పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగం కోసం ఆర్‌ఆర్‌బీ, ఆర్మీ, పోలీస్ ఇలా ఏ నోటిఫికేషన్ పడ్డా దరఖాస్తు చేస్తూ పరీక్షలు రాసేవారు. ఆ సమయంలో జిరాక్స్ పత్రాలపై సంతకాల కోసం గెజిటెడ్ అధికారుల వద్దకు వెళ్లినప్పుడు పెద్దాఫీసరు కావాలనే చిన్నప్పటి కోరిక మరోసారి ఊపిరి పోసుకుంది.

పనే దైవంగా..

కుటుంబ భారాన్ని మోస్తూనే చదువుపై దృష్టి సారించారు బలరాం. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చదవాలని నిర్ణయించుకున్నారు. అప్పటికే ముగ్గురు పిల్లలు కావడంతో కుటుంబ పోషణ కోసం పీఎంఆర్‌వై స్కీం ద్వారా ఆటో తీసుకుని నడిపారు. చదువుకు సమయం వెచ్చించాల్సి వచ్చినప్పుడు ఆటో అద్దెకు ఇచ్చేవారు. ఆటో నడిపినప్పుడు గ్యాస్ సిలిండర్లను భుజాలపై మోస్తూ డెలివరీ చేశారు.



సింగరేణి సీఎండీగా...

సివిల్సే లక్ష్యం..

డిగ్రీ పూర్తవగానే సివిల్స్ రాసేందుకు సిద్ధమయ్యారు. అప్పటి వరకు తెలుగు మీడియం, అదీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో చదువుకుని సివిల్స్‌కు సిద్ధమవడం కష్టమనే నిర్ణయానికి వచ్చా రు. అందు కోసం ప్రభుత్వం ఉచితంగా కోచింగ్ ఇచ్చే ఏపీ స్టడీ సర్కిల్‌లో చేరాలని వెళ్తే పీజీ పూర్తి చేసి ఉండాలని చెప్పారు. దీంతో డిస్టెన్స్‌లో పీజీ చదువుతూనే పార్ట్ టైం ఉద్యోగాలు చేసేవారు. ఎంత పెద్ద లక్ష్యమైనా చిన్న అడుగుతోనే మొదలనే మాటను నిజం చేస్తూ డిగ్రీ అర్హతగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసే వారు. ఈక్రమాన గ్రూప్ 1, 2 పరీక్షల్లో సానుకూల ఫలితాలొచ్చినా సివిల్స్ లక్ష్యాన్ని మర్చిపోలేదు.

ప్లాన్ ఆఫ్ యాక్షన్

పీజీ పూర్తి కాగానే స్టడీ సర్కిల్‌లో చేరారు బలరాం నాయక్. కోచింగ్ సమయంలో క్షణం వృథా చేయకుండా ఉదయం నుంచి రాత్రి రెండు గంటల వరకు, కనీసం ఇంటికి వెళ్లకుండా సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. దీంతో మొదటి ప్రయత్నంలోనే 2010లో సివిల్స్‌కు ఎంపికై ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌లో జాయిన్ అయ్యారు. తొలుత మేడ్చల్‌లో సెంట్రల్ కస్టమ్స్ డివిజన్ అధికారిగా, ఆ తర్వాత ముంబైలో డిప్యూటీ కమిషనర్‌గా పని చేశారు. 2017లో సింగరేణిలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా చేరి, డైరెక్టర్(పా)గా సేవలు అందించి ప్రస్తుతం సింగరేణి సీఎండీగా కొనసాగుతున్నారు. ఒకప్పుడు ఖర్చుల కోసం కూలి పని చేసి రూ.25 సంపాదించిన వ్యక్తి నేడు రూ.40 వేల కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన కంపెనీకి బాస్‌గా అనేక మందికి స్ఫూర్తినిస్తున్నారు.

కలలు కన్నారు.. సాధించారు! 8లో
జిల్లా స్థాయి అధికారుల విజయగాథలు

కలలు కన్నారు.. సాధించారు!

అందరూ సాధారణ కుటుంబాల్లో జన్మించిన వారే. కొందరైతే కనీస వసతులు లేని పల్లెల్లో పుట్టినా చదువుపై మమకారం పెంచుకున్నారు. విద్యుత్ సౌకర్యం, తల్లిదండ్రులకు ఫీజులు కట్టే స్థోమత లేకున్నా కష్టాలకు ఎదురీదారు. విద్యార్థి దశలోనే ఉన్నత స్థానానికి చేరాలని నిర్ణయించుకున్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా తాము కన్న కలల తీరాన్ని చేరేందుకు శ్రమనే నమ్ముకున్నారు. దీంతో కష్టాలు, కన్నీళ్లు వారి ముందు తలొంచాయి. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జిల్లా స్థాయి అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు అధికారుల స్ఫూర్తిదాయక కథనాలు నేడు బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల కోసమే కాదు అందరి కోసం!

- కనీస సౌకర్యాలు లేని పల్లెల నుంచి వచ్చినా విరామమెరుగక పోరాటం
- కష్టాలకు ఎదురొడ్డి విజేతలుగా నిలిచిన పలువురు
- ప్రస్తుతం జిల్లా స్థాయి అధికారులుగా విధులు

కిరోసిన్ దీపం కింద కూర్చుని చదివా..


బాదావత్ లక్ష్మయ్య

పాల్వంచ: మాది ప్రస్తుత సూర్యాపేట జిల్లా మునగాల మండలం సీతారాంపురం తండా. అమ్మానాన్నలు తావుర్యా – సాజీకి మేం నలుగురు సంతానం. ఐదెకరాల భూమిలో పంటలు సాగుచేస్తూ నాన్న కుటుంబాన్ని పోషించేవారు. పెద్దకుమారుడిగా నేను అమ్మానాన్నతో వ్యవసాయ పనులకు వెళ్లేవాడిని. 1 నుంచి 7వ తరగతి వరకు తండా నుండి ఆరు కి.మీ. దూరాన రేపాలకు నడుచుకుంటూ వెళ్లి చదువుకున్నాక 8, 9, 10, ఇంటర్ సూర్యాపేట హాస్టల్‌లో ఉంటూ పూర్తిచేశా. హైదరాబాద్‌లో జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్ పూర్తిచేశాక ఏపీఎస్ఈబీలో 1990లో ఏఈగా ఉద్యోగం వచ్చింది. మూడు నెలల శిక్షణ అనంతరం పాల్వంచ కేటీపీఎస్‌లో ఏఈగా చేరా. అయితే, ఇదంతా సాఫీగా ఏం జరగలేదు. చిన్నతనాన తండాలో కరెంట్ లేకపోగా కిరోసిన్ దీపాల కింద చదువుకున్నా. పదో తరగతి వరకు చెప్పులు కూడా లేవు. మునగాల మండలంలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన తొలివ్యక్తిని నేనే. ఇందుకు నాన్న ప్రోత్సాహమే కారణం. నాకు 1991లో డోర్నకల్‌కు చెందిన శాంతాబాయ్‌తో వివాహం జరగగా భార్గవి, దినేష్ కుమార్ సంతానం. ఏఈ నుంచి ఏడీఈ, డీఈ, ఎస్ఈ, సీఈ వరకు కేటీపీఎస్‌లోనే పదోన్నతులు పొందిన నేను శ్రీశైలం, కేటీపీఎస్, విద్యుత్ సౌధల్లో సీఈగా పనిచేశాక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందా. కేటీపీఎస్, వైటీపీఎస్, బీటీపీఎస్, కేటీపీపీ, ఆర్‌టీపీపీల్లో పనిచేస్తూ ఇప్పుడు డైరెక్టర్ స్థాయికి ఎదిగాను. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని కష్టాలు ఎదురైనా ముందుకు సాగితే మంచి ఫలితం వస్తుంది. తెలియని విషయాన్ని అడగడంలో బిడియపడొద్దు. నాకు సైతం విధుల్లో ఐదు శాతమే తెలుసు.. మిగతా 95శాతం సహచరుల సహకారంతో పనిచేస్తుండడంతో విజయాలు సొంతమయ్యాయి.

– బాదావత్ లక్ష్మయ్య, టీజీ జెన్‌కో డైరెక్టర్(థర్మల్)

నాన్న ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి..


డిగ్రీ చదివే రోజుల్లో...


బీసీ అభివృద్ధి శాఖ డీడీగా...

ఖమ్మంమయూరిసెంటర్: తండ్రి ప్రోత్సాహం, ఆయన ప్రేమతోనే నా జీవితం ఈ స్థాయికి చేరింది. మా స్వగ్రామమైన మిర్యాలగూడలోనే చదువు కొనసాగింది. నేను పదో తరగతిలో ఉన్నప్పుడు అమ్మని కోల్పోయా. అప్పటి నుంచి నాన్న సుందరయ్య ప్రోత్సాహంతో జీవనం కొనసాగింది. ఆడపిల్లను ఉన్నత చదువులు చదివిస్తే వివాహానికి ఇబ్బంది అవుతుందని ఎందరు చెప్పినా మా నాన్న పట్టించుకోలేదు. పిల్లలు చదువుకోవాలి, వాళ్ల కాళ్లపై వారు నిలబడాలని చెప్పేవారు. నేను టీటీసీ.. ఆ తర్వాత డిగ్రీ, బీఈడీ చేసి టీచర్ ఉద్యోగం సాధించా. అనంతరం కుటుంబ ప్రోత్సాహంతో చదువు కొనసాగించా. వివాహమయ్యాక ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు సిద్ధమయ్యాను. ఆ సమయంలో నాన్న మాతోనే ఉంటూ పిల్లల్ని చూసుకున్నారు. బాల్యంలో, ఉద్యోగ సమయాన సహకరించిన ఆయన ఉన్నత ఉద్యోగం సాధించేలా అండగా నిలబడ్డారు. మేము మిర్యాలగూడెంలో ఓ కాల్వ పక్కన నివాసం ఉండేవాళ్లం. డిగ్రీ చదివే రోజుల్లో వచ్చిన భారీ వరదలతో నా చిన్ననాటి జ్ఞాపకాలైన ఫొటోలు, సర్టిఫికెట్లను కోల్పోయాను. స్నేహితుల వద్ద ఉన్న కొన్ని ఫొటోలను తీసుకొని జ్ఞాపకాలుగా భద్రపరుచుకున్నాను. ఎన్నో బాధలను అధిగమించి ఈ స్థాయికి ఎదగడం గర్వంగా ఉంది.

– గుడికందుల జ్యోతి, డీడీ, బీసీ అభివృద్ధి శాఖ, ఖమ్మం

చదువుకోవడం కోసం చాలా కష్టపడ్డాం..


పదో తరగతిలో...


ప్రస్తుతం

ఖమ్మంవన్‌టౌన్ : ఆ రోజుల్లో మేము చదువుకోవాలనే తపనతో చాలా కష్టపడ్డాం. అప్పుడు ప్రైవేట్ పాఠశాలలు లేవు. నేను ఖమ్మంలోని సెయింట్ మేరీస్ మిషనరీ పాఠశాలలో చదివా. నాన్న ఆర్టీసీలో చిరు ఉద్యోగి. జీతం తక్కువైనా మమ్మల్ని చదివించాలనే ఆశయంతో ట్యూషన్‌కు పంపేవారు. గ్రామాల నుండి వచ్చి మా స్కూల్ హాస్టల్‌లో చాలా మంది ఉండేవారు. వాళ్లకు నేను ట్యూషన్‌లో నేర్చుకున్నది చెప్పేదాన్ని. అలా నా వద్ద పాఠాలు విన్న చాలా మంది ఉద్యోగాలు సాధించారు. ఆ రోజుల్లో మాకు కెరీర్ గైడెన్స్ ఇచ్చేవారు కూడా లేరు. ఇంజనీర్ అవ్వాలనే కోరిక ఉన్నా ఇంజనీర్లు అంటే కేవలం నిర్మాణ రంగంలోనే ఉంటారని అనుకునేదాన్ని. ఆతర్వాత డిప్లొమా సివిల్ మెదక్‌లో పూర్తిచేశా. 1998లో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికై కరీంనగర్ జిల్లా మంథనిలో ఉద్యోగంలో చేరాను. ప్రజలకు తాగునీరు సరఫరాను పర్యవేక్షించే బాధ్యత నాది. ఇప్పుడు సొంత జిల్లాలో పనిచేయడం నా అదృష్టం. నిత్యం గ్రామాలు తిరుగుతూ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రతీ ఇంటికి నీరందేలా నా వంతు కృషిచేస్తున్నా.

– పుష్పలత, మిషన్ భగీరథ ఈఈ, ఖమ్మం

మూడు కి.మీ. నడిస్తేనే చదువు


చిన్నతనంలో...


ఇప్పుడు సీఈగా..

పాల్వంచరూరల్: కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌కు చెందిన బుచ్చిరాంరెడ్డి – వెంకటలక్ష్మికి నేను మూడో కుమారుడిని. ఇంటర్ వరకు స్వగ్రామం, కరీంనగర్‌లో, ఉన్నత విద్య హైదరాబాద్‌లో పూర్తిచేశా. చిన్నతనంలో స్కూల్‌కు వెళ్లడానికి మూడు కి.మీ. నడిచి వెళ్లేవాళ్లం. అయినా ఏనాడు స్కూల్‌కు వెళ్లడం మానలేదు. మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉండగా చదువుపై నిర్లక్ష్యాన్ని వీడకపోవడంతో ఈ స్థాయికి చేరా.

– ఎ.శ్రీనివాసరెడ్డి, జలవనరుల శాఖ సీఈ, భద్రాద్రి జిల్లా

తేమతో నిమిత్తం లేకుండా పత్తి ధర నిర్ణయం


ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్ల సందర్భంగా వ్యాపారుల తీరు మారలేదు. మార్కెట్‌ను మంగళవారం తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తేమ శాతం ఆధారంగా ధర ఖరారు చేయాలని, లేనిపక్షంలో వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే బుధవారం 876 మంది రైతులు 21,330 బస్తాల పత్తిని తీసుకురాగా వ్యాపారులు యంత్రాలతో తేమ పరీక్షించకుండానే ఇష్టారాజ్యంగా ధర నిర్ణయించారు. నాణ్యమైన పత్తి క్వింటాకు గరిష్ఠంగా రూ.7వేలు, మోడల్ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,800గా నిర్ణయించారు. కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర రూ.7,521 మాత్రం ఎవరికీ దక్కలేదు. ఇక కలెక్టర్ సూచనలతో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన ఉద్యోగులు, సిబ్బంది యంత్రాలతో పత్తిని పరీక్షించి రైతుల వివరాలు, తేమ శాతాన్ని రికార్డు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా తేమ ఉన్న పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. ఇదే సమయాన వ్యాపారుల తీరుపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పలు కేజీబీవీలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా అభ్యర్థుల సర్టిఫికెట్లను బుధవారం పరిశీలించారు. ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయంలో చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలనకు 38మంది లో 30మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ, జీసీ డీఓ తులసి వెల్లడించారు. కాగా, ఖమ్మంలోని రిక్కాబజార్ హైస్కూల్‌ను డీఈఓ సోమశేఖరశర్మ సందర్శించి విద్యార్థులతో భోజనం చేసి బోధన, సౌకర్యాలపై ఆరా తీశారు.

ఆర్టీసీ 'డీలక్స్' విజేతలకు బహుమతులు


బహుమతి అందజేస్తున్న ఆర్‌ఎం

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ సూపర్ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికుల నుంచి లక్కీ డ్రా ద్వారా ఎంపికైన వారికి బహుమతులు అందజేశారు. ఆగస్టు, సెప్టెంబర్‌ల్లో రీజియన్ వ్యాప్తంగా 48మందిని బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయగా రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ బహుమతులు అందజేశారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) జీఎస్.పవిత్ర, ఖమ్మం డీఎం దినేష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

నేలకొండపల్లి: గ్రామీణ క్రీడలను అందరూ ప్రోత్సహించాల్సిన అవసరముందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాజేశ్వరపురంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కబడ్డీ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పాల్గొన్నారు.

కోలాహలంగా ఎద్దుల పోటీలు

రాజేశ్వరపురంలో ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈసందర్భంగా నాలుగు పళ్ల విభాగంలో పోటీలు జరగగా విజేతలకు బహుమతులు అందజేశారు. సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తితో పాటు ఎర్రబోయిన నర్సయ్య, చిట్యాల రమేష్, కడియాల నరేష్, దండా సత్యనారాయణ, ఇస్లావత్ బాలాజీ, దండా వెంకటేశ్వర్లు, ఆర్.నవీన్, కె.ఉపేందర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎద్దుల పోటీలలో అపశ్రుతి దొర్లింది. ఏపీలోని చందర్లపాడు మండలానికి రైతులు ఒంగోలు ఎద్దులతో హాజరుకాగా అవి బెదిరి ఫెన్సింగ్‌ను దాటుకుని ప్రజల వైపు దూసుకెళ్లాయి. ఈక్రమాన బైక్‌లు, ఇతర వాహనాలు ధ్వంసమవడంతో పాటు పలువురు గాయపడ్డారు. చివరకు పలువురు ఎడ్లను అదుపులోకి తీసుకోవడంతో ప్రమాదం తప్పింది.

అన్నం ఫౌండేషన్‌కు విరాళం


చెక్కు అందజేస్తున్న ఎస్ఈ, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలో వృద్ధులు, అనాథలకు సేవ చేస్తున్న అన్నం ఫౌండేషన్‌కు ఎన్పీడీసీఎల్ ట్రస్టు ద్వారా అందిన రూ.20 వేల విరాళాన్ని ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావుకు ఆయన చెక్కు అందజేసి మాట్లాడుతూ శరణాలయం నిర్వహణకు ఈ నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

వైరారూరల్/కామేపల్లి/కొణిజర్ల: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించొచ్చని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ తెలిపారు. మండలంలోని రెబ్బవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేసిన ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆ తర్వాత పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలపై భయాన్ని వీడి శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, కామేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆ తర్వాత కుటుంబ సర్వేను పరిశీలించారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం శైలా పాల్గొన్నారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వీ.మధుసూదన్ పరిశీలించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పిల్లలమర్రి మురళీకృష్ణ పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్ సన్నాహక సమావేశం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఈనెల 26, 27వ తేదీల్లో సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ నిర్వహించాలని నిర్ణయించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ మేరకు పాత డీఈఓ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్‌ఎంలు, పీడీలు, ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. డీఈఓ మాట్లాడుతూ సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్‌లో అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యేలా చొరవ తీసుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ఘటనపై విచారణ

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థులు బయటకు వెళ్లడాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విచారణ జరిపించారు. అయితే, ఇందుకు దారి తీసిన పరిస్థితులు ఇలా ఉన్నాయి. విద్యార్థులు సాగర్, కౌశిక్, మురళి మంగళవారం హాస్టల్ పక్కనే చెట్ల కింద ఆడుతుండగా తేనెతుట్టె కనిపించింది. దానిపై రాళ్లు వేయడంతో తేనెటీగలు మురళిపై దాడి చేయగా కామాటి నేలకొండపల్లిలో చికిత్స కోసం తీసుకెళ్లాడు. అయితే, సాగర్, కౌశిక్ భయపడి ఖమ్మం పారిపోయేందుకు బయటకు వచ్చినట్లు తెలిసింది. ఈక్రమాన బయటకు వచ్చి లిఫ్ట్ అడిగే క్రమాన ఓ యువకుడు అనుమానంతో తీసుకెళ్లి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఆపై తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో తీసుకెళ్లారు. కాగా, ఈ సమాచారం తెలియడంతో కలెక్టర్ విచారణ జరిపించగా, బుధవారం కామాటి వీరేందర్‌ను పెనుబల్లి హాస్టల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. అలాగే, వార్డెన్ రవూఫ్ సెలవులో ఉండడంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు బాలకృష్ణకు అప్పగించారు.

హోరాహోరీగా పోటీలు

వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 14 గురుకులాల నుండి విద్యార్థులు హాజరవుతుండగా పోటీలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఈమేరకు వ్యక్తిగత విభాగాల్లో విజేతలకు తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కాగా, వైరా గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థిని నాగసుష్మ ఇచ్చిన నృత్యప్రదర్శన ఆకట్టుకోగా తహసీల్దార్ అభినందించారు. కాగా, పోటీలు గురువారం ముగియనుండగా డిప్యూటీ సీఎం మల్లు భట్టు విక్రమార్క ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందజేస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, క్రీడల కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు.

టోర్నీలో ద్వితీయ స్థానం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ టోర్నీలో ఖమ్మం, భద్రాద్రి ఉద్యోగుల బాస్కెట్‌బాల్ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు కరీంనగర్‌లో ఈ టోర్నీ జరిగింది. ఈ మేరకు క్రీడాకారులు బుధవారం ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్‌ను కలవగా ఆయన అభినందించారు.

అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్..

రఘునాథపాలెం: వాహనాలు తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలు చేసినట్లు తేలడంతో ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం ఆయన వెల్లడించిన వివరాలు... ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బందితో రఘునాథపాలెంలో తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆటో, మోటార్ సైకిల్‌పై వెళ్తూ పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారిని వెంబడించి అదుపులోకి తీసుకోగా వల్లకొండ శివసాయి, బెల్లి సందీప్, రావర్తి బాబ్జీగా తేలింది. వీరు తల్లాడ, కూసుమంచి, నేలకొండపల్లి, కోదాడ, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాలతో పాటు హైదరాబాద్‌లోని మియాపూర్, వరంగల్ జిల్లా నల్లబెల్లి, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలాల్లో చోరీకి పాల్పడినట్లుగా ఒప్పుకున్నారు. దీంతో నిందితుల నుంచి 21 తులాల వెండి పట్టీలు, అర తులం బంగారపు చెవిదిద్దులు, ఒక ఆటో, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డుప్రమాదం కాదు.. హత్య ?

కృష్ణాపురం ఘటనపై పోలీసుల కేసు నమోదు


సోమయ్య (ఫైల్)

మధిర: మండలంలోని కృష్ణాపురం సమీపాన మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరగగా ఓ వ్యక్తి మృతి చెందాడు. అయితే, ఇది ప్రమాదం కాదని అందిన ఫిర్యాదుతో పోలీసులు బుధవారం హత్య కేసుగా నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కల్లూరు మండలం యర్రబోయినపల్లికి చెందిన ఫిజియోథెరపిస్ట్ కోలికపోగు సోమయ్య(40) మూడు రోజుల క్రితం బోనకల్ మండలం రావపల్లిలోని అత్తగారింటికి వెళ్లాడు. ఈనెల 12న మధ్యాహ్నం సోమయ్య తన భార్యకు ఫోన్ చేసి అప్పగుర్తిలోని బంధువుల ఇంటికి వెళ్తున్నట్లు చెప్పాడు. అక్కడ స్నేహితులతో కలిసి మద్యం సేవించాక బైక్‌పై రావపల్లికి తిరిగి వెళ్తుండగా వచ్చిన లారీ కారణంగా ప్రమాదం జరగబోయిందని భావించినట్లు తెలిసింది. ఈమేరకు లారీని పాలడుగు క్రాస్ రోడ్డు వద్ద, ఆతర్వాత మరోచోట ఆపేందుకు యత్నించినా ఫలితం లేక మధిర మండలం కృష్ణాపురం సమీపాన బైక్‌ను అడ్డుగా పెట్టాడు. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్‌తో వాగ్వాదం జరగగా ఆతర్వాత లారీకి అడ్డుగా నిలబడిన సోమయ్యను ఢీకొట్టి వెళ్లిపోయినట్లు సమాచారం. అయితే, రోడ్డుప్రమాదం జరిగిందనే సమాచారంతో మధుర రూరల్ ఎస్ఐ లక్ష్మీచేరుకుని చేరుకుని లారీని ఎర్రుపాలెం సమీపాన పట్టుకున్నారు. కాగా, లారీ డ్రైవర్, క్లీనర్, సోమయ్య మధ్య వివాదాన్ని వారి వెనుక బైక్‌పై వచ్చిన ఇద్దరు గమనించగా... హత్యగా భావించి సోమయ్య కుటుంబీకులు బుధవారం సీఐ కార్యాలయం వద్ద కేసు మార్చాలని నిరసన తెలిపారు. ఈ విషయమై సీఐ మధు మాట్లాడుతూ ప్రాథమిక విచారణ మేరకు హత్య కేసుగా నమోదు చేశామని తెలిపారు. అయితే, ప్రమాదమా, హత్య చేశారా అన్నది దర్యాప్తులో తేలుతుందని వెల్లడించారు. కాగా, సోమయ్యకు భార్యతో పాటు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.